క్లుప్తంగా

అన్నసమారాధన

కడియం: గ్రామదేవత వనువులమ్మ జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. అమ్మవారిని వివిధ పార్టీల నాయకులు దర్శించుకున్నారు.

షూటింగ్ లొకేషన్ల పరిశీలన

కడియం: సినిమా షూటింగ్ కోసం గోదావరి లంక ప్రాంతాలు, కడియం నర్సరీల్లో పలు లొకేషన్లను ప్రముఖ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్, సినిమాటోగ్రాఫర్ చోటా కె.నాయుడు ఆదివారం పరిశీలించినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ మేరకు కడియంలో విలేకరులతో యూనిట్ సభ్యులు మాట్లాడుతూ ద్వారకా క్రియేషన్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటున్న సినిమా షూటింగ్ మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందన్నారు. రెండో షెడ్యూల్ సోమవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. కొత్త నటీనటులతో నిర్మితమయ్యే ఈ సినిమాలో పలు సన్నివేశాలు, పాటలను ఉభయ గోదావరి జిల్లాల్లోని పలుచోట్ల చిత్రీకరించేందుకు షెడ్యూల్ రూపొందించారన్నారు. రవీంద్రరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ నెలాఖరు వరకు ఉంటుందన్నారు.

పుష్కరఘాట్‌లో చెత్త తొలగింపు

ప్రకాశం నగర్: బ్రింగ్ బ్యాక్ గ్లోరీ టీమ్ సభ్యులు ఆదివారం స్థానిక పుష్కర ఘాట్‌లో క్లీనింగ్ డ్రైవ్ చేపట్టారు. ఘాట్‌లో పేరుకుపోయిన సుమారు 500 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు, దుస్తులు, పూజాసామగ్రిని 20 మంది వలంటీర్లు తొలగించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు మాట్లాడుతూ గోదావరి తీరాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నదిని ప్రక్షాళన చేయాలని పిలుపునిచ్చారు. టీమ్ సభ్యులు రాజ్, చరణ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల ఇంటికి నిప్పు



ఘటనలో దగ్ధమైన బైక్

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో హత్యకు గురైన సిద్ధిరెడ్డి రవికుమార్ కేసులో నిందితులైన మృతుడి చిన్నాన్న సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, అతడి కుమారుడు రమేష్ నాయుడు చెందిన ఇంటికి ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంటి బయట ఉన్న బైక్, ఇంట్లో కొంత సామగ్రి కాలిపోయింది. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి తెలిపారు.

నేడు 'స్పందన'

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

జనచైతన్య శంఖారావం

రాజమహేంద్రవరం రూరల్: జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ ఆదివారం కోలమూరు గ్రామంలో జనచైతన్య శంఖారావం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జనసేన సిద్ధాంతాలు, ప్రాముఖ్యతను వివరించారు. మాజీ ఎంపీపీ చెరుకూరి రామారావు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

అన్ని సంఘాలూ ఐక్యంగా ఉండాలి

ప్రకాశం నగర్: పేపర్ మిల్లు యాజమాన్యం నియంత పోకడలను అరికట్టడానికి వచ్చే గుర్తింపు ఎన్నికల్లో అన్ని సంఘాలు ఐక్యంగా ఉండాలని, యాజమాన్యం తొత్తు అవినీతి కార్మిక సంఘాన్ని ఓడించాలని ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. పేపర్ మిల్లు వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఆదివారం యూనియన్ అధ్యక్షుడు ఏ.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు.

సినిమాలు

శ్యామల	మీటర్
సూర్యమినీ	భూతవైద్యుడు
సూర్యప్యాలెస్	రావణాసుర
స్వామి	రావణాసుర
అశోక	దసరా
శివజ్యోతి	దసరా
రాజా	రావణాసుర
ఊర్వశి	దాస్‌కాదమ్కీ
రంభ	రావణాసుర
మేనక	భూతవైద్యుడు
నామవరం	
వీఎస్ మహల్	దసరా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	దసరా
కడియం	
వెంకటసూర్య	రావణాసుర

మూడేళ్లుగా మూతపడి..



మూతబడిన ప్రీపెయిడ్ ఆటోస్టాండ్

- పునఃప్రారంభం కాని ప్రీపెయిడ్ ఆటోస్టాండ్
- ప్రయాణికుల అవస్థలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వేస్టేషన్‌లోని ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ మూతపడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా నేపథ్యంలో మూసివేసిన ఈ ఆటోస్టాండ్‌ను తిరిగి ప్రారంభించలేదు. విజయవాడ డివిజన్‌లో ప్రధాన రైల్వేస్టేషన్ రాజమహేంద్రవరం. ఈ స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 140 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ రోజుల్లో సుమారు 30 వేల మంది ప్రయాణం చేస్తారు. 2017 మార్చి 29న ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌ను అప్పటి అర్బన్ ఎస్పీ రాజకుమారి ప్రారంభించారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లోని రెండు ఆటో యూనియన్లకు చెందిన 76 ఆటోలు ఈ స్టాండ్‌లో సభ్యత్వం కలిగి ఉన్నాయి. 2017లో మొదలైన ఈ ఆటో స్టాండ్ మూడేళ్లు సజావుగానే సాగింది. 2020లో కరోనా ప్రభావంతో ఈ ఆటోస్టాండ్ మూతపడింది.

సురక్షిత ప్రయాణానికి..

ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌తో ప్రయాణికులకు ఎంతో మేలు కలిగేది. పోలీస్ రక్షణ వ్యవస్థ ఆధ్వర్యంలో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చేవారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రయాణికులు రైలు దిగిన వెంటనే ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి తాము వెళ్లాల్సిన చిరునామా తెలియజేసేవారు. పోలీస్ అధికారులు నిర్ణయించిన ఆటో ధరను చెల్లించి రక్షణతో కూడిన ప్రయాణం సాగించేవారు. ప్రయాణికులు తీసుకువెళ్లే ఆటోడ్రైవరు పేరు, వివరాలు, ఆటో నంబర్‌ను ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ వద్ద పోలీసు సిబ్బంది నమోదు చేసుకునేవారు. ఈ విధానంలో ప్రయాణికులు స్వేచ్ఛగా, అర్ధరాత్రి సమయంలోనైనా క్షేమంగా ఇళ్లకు చేరుకునేవారు. పోలీసుల ఆధ్వర్యంలో నడిచే ఈ ఆటోస్టాండ్ మూతపడటంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైలు దిగిన తర్వాత నిర్ణీత ఆటోధర లేకపోవడంతో.. ఆటోడ్రైవర్ చెప్పిందే చెల్లించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆటోస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

> **ఎంతో ఉపయోగం**
>
> 
>
> రైలుదిగి వచ్చే ప్రయాణికులకు పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్ ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. మూడేళ్లుగా మూతపడిన ఈ ఆటో స్టాండ్‌ను అధికారులు పునఃప్రారంభించాలి. దీనిపై ఎస్పీ ప్రత్యేక చొరవ చూపాలి.
>
> – రామకృష్ణ, ప్రయాణికుడు

వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్'

- ప్రజల నుంచి విశేష స్పందన
- జగన్ పాలనకు సంపూర్ణ మద్దతు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మూడోరోజు ఆదివారం రూరల్ నియోజకవర్గంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్‌అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ డివిజన్లు, కడియం, రూరల్ మండలాల జేసీఎస్ కన్వీనర్లు కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు(రాజమౌళి), తాడాల చక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి నేతృత్వంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆత్మీయంగా స్వాగతించారు. జగన్ ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలన్నది తమ ఆకాంక్ష అని ప్రజామద్దతు పుస్తకంలో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు నమోదు చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ ఇంటి తలుపులు, మొబైల్ ఫోన్లకు వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను ఇష్టంగా అతికించుకున్నారు. 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి మద్దతు తెలిపారు. ప్రతి ఇంటిలోనూ రెండు నుంచి ఐదు సంక్షేమ పథకాలు అందుతున్నాయని సర్వత్రా సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు రాబోయే ఎన్నికలలో మద్దతుగా నిలుస్తామని భరోసా ఇస్తున్నారు.



బొమ్మూరులో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నగరంలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సంక్షేమ పథకాలు ప్రతిఇంటా తెలియాలి

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజెప్పేందుకు కృషి చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జి అప్పారావు, లంక సత్యనారాయణ అన్నారు. స్థానిక 31వ డివిజన్ అన్నపూర్ణపేటలో 57వ సచివాలయం ఇన్‌చార్జి మజ్జి నూకరత్నం ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నల్లా రామాంజనేయులు, చొక్కాకుల శీను బాబు, మస్తాన్, ముచకర్ల చిన్నారావు, కరుముజ్జి శివ పాల్గొన్నారు.

సమాజసేవతో జీవితాలకు సార్థకత

రంగంపేట: సత్యసాయి సమాజసేవ, ఆధ్యాత్మిక సూక్తులను ఆచరణలో పెట్టి జీవితాలను సార్థకత చేసుకోవడానికి నిరంతరం సాధన చేయాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం కొత్త కొటపాడు గ్రామంలో రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు, స్థానిక శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కంతర్ప వెంకట అమర్‌నాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన పుట్టపర్తిలో జరిగే సత్యసాయి ఆరాధనోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు, సేవాదళ్ సభ్యులు తరలిరావాలని కోరారు. వచ్చే నెల 21న రాజమహేంద్రవరంలో జరిగే నమామి శత రుద్రీయం కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోని జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, జిల్లా విభాగ సమన్వయకర్త ఎల్ శ్రీనివాస్‌రాజు, సబ్ జోన్ ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్తలు టి.సత్యనారాయణ, కె.భార్గవి, బాలవికాస్, కన్వీనర్లు టి.శ్రీనివాసరావు,కే,బానుమతి, సేవాదళ్ లీడర్ మాగాపు వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

యువకుడి ఆత్మహత్య

కంబాలచెరువు: నల్లమందుకు చెందిన కె.వెంకటేశ్ (30) పేపర్‌మిల్లులో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. అతడు నాలుగేళ్లుగా ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. రెండేళ్లక్రితం వెంకటేష్ కుటుంబీకులు ఆ యువతి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారు తమ పెద్దమ్మాయికి పెళ్లి అయ్యాక చేస్తామని చెప్పారు. అయితే వారి పెద్దమ్మాయికి పెళ్లి అయినా ఆమె తల్లిదండ్రులు ముందుకు రాకపోవడంతో వెంకటేష్ మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరుగురి అరెస్టు

బిక్కవోలు: గ్రామ శివారుల్లో జరుగుతున్న కోడిపందెలపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులు అరెస్టు చేసినట్టు ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వచ్చిన సమాచారం మేరకు బిక్కవోలు గ్రామంలోని వీర్రాజు పేట శివారులో కోడిపందేలపై దాడి చేసి, ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోళ్లు, రూ.1,810 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిక్కవోలు: గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన బిక్కవోలు వంతెన వద్ద లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో గాయపడిన కటామల రాంబాబు(45) ఆదివారం ఉదయం కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాట్టు ఆయన తెలిపారు.

దోర్లమ్మ తల్లికి పూజలు

రాజానగరం: కానవరం గ్రామదేవత దోర్లమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకుని, సారె సమర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు యర్రంశెట్టి శ్రీరామకృష్ణ, ఎంగీత సత్తిబాబు, వెంకటేశ్వర్రావు, వీర వెంకట్రావు, బాసిబాబు ఉన్నారు.

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

బిక్కవోలు: అభాగ్య పిల్లలు, తల్లిదండ్ర లేని పిల్లలు మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఊలపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు మరణించి అనాథలుగా ఉంటూ పోషణకు దూరంగా ఉన్న పిల్లలు, తల్లి వితంతువు, విడాకులు తీసుకున్న వారి పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధికి గురైన పిల్లలు కూడా అర్హులన్నారు. ఇలాంటి పిల్లలకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయంలోని మహిళ సంరక్షణ కార్యదర్శి అందించాలన్నారు.

జగన్ పాలన.. సంక్షేమానికి చిరునామా



గరగలంపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గరగలంపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా మారిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గరగలంపాలెంలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత గరగలం తల్లిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి 10.15 గంటల వరకూ స్థానిక ఎస్సీ, బీసీ, ఎస్టీ పేటల్లోని 130 గడపలు తిరిగారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. వెన్నెముక సమస్యతో బాధపడుతూ పనులు చేసుకోలేనిస్థితిలో ఉన్న కోళ్ల ప్రవీణ్ పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ. 5 వేలు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే సంక్షేమ పథకాలందుతున్న తీరును తెలుసుకున్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ గ్రామంలో త్వరలో రూ.42.7 లక్షలతో 40 వేల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు, రూ.32 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, నాయకులు అడబాల చినబాబు, కడియాల పాపారావు, గరగలంపాలెం సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, బోడపాటి అరవాలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో టీడీపీ సీనియర్ నాయకుడు కడియం శ్రీరాములు, గరగలంపాలెం గ్రామానికి చెందిన మరుకుర్తి నూకరత్నం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారిని ఎమ్మెల్యే రాజా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన నాయకులను సమన్వయం చేసుకుంటూ గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, గ్రామ సర్పంచ్ కె.వెంకట రామకృష్ణ, గరగలంపాలెం నాయకుడు బోడపాటి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం.. మానవాళికి ఆదర్శం



ఈస్టర్ వేడుకలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా ఈస్టర్ వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ: ఏసుక్రీస్తు చూపిన మార్గం.. మానవాళికి ఆదర్శనీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని వై.జంక్షన్ వద్ద బైబిల్ మిషన్ కాథెడ్రాల్‌లో ఆదివారం జరిగిన క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సహనం, త్యాగం, కరుణ, మానవత్వం తదితర సుగుణాలన్నీ మేళవించిన మహనీయుడు ఏసుక్రీస్తు అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సద్గుణాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బిషప్ ఎస్.విజయరాజు, డాక్టర్ ఎస్.సైమన్ సుదర్శన్, ఎస్.విలియమ్ బెంటింక్, శీతనబోయిన సాయిరామ్ (పాల సాయి), ఎస్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భోజనం పంపిణీ

ప్రకాశం నగర్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆనంద్ పాట్ల ఆధ్వర్యంలో ఆదివారం వీరభద్రపురంలోని గాంధీ కస్తూర్బా వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం మందులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డేవిడ్ నాయుడు, వరప్రసాద్, ఏకబాబు తదితరులు పాల్గొన్నారు.

షారోను గృహంలో..

కంబాలచెరువు: పాపులమైన మనల్ని రక్షించేందుకు ఏసుక్రీస్తు శిలువపై మరణించి, తిరిగి లేచిన మహాదినమే ఈస్టర్ పండగ అని రెవరెండ్ పి.ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. స్థానిక వెంకటాపురంలోని సీయోను ప్రార్థన మహిమ మందిరం షారోను గృహంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు క్షమాగుణం, ఆయన బోధనలపై ఎర్నెస్ట్ మోజెస్ వాక్యోపదేశం చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్షమాపణ, దయ, సహనాన్ని ఏసుక్రీస్తు బోధనల నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీయోను ప్రార్థన మహిమ మందిరం వ్యవస్థాపకుడు డాక్టర్ గారపాటి ఎలిజబెత్ పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో సమాధుల వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



మాట్లాడుతున్న రెవరెండ్ ఎర్నెస్ట్ మోజెస్

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం ధవళేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. ఎర్రకొండ క్రైస్తవ సమాధుల వద్ద తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఎంఈ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు.

బొల్లినేనిలో పారా మెడికల్ డిప్లమో కోర్సులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని బొల్లినేని హాస్పిటల్ మెడిస్కిల్స్ పారా మెడికల్ ఇనిస్టిట్యూట్‌లో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్‌కౌన్సిల్ నుంచి అనుమతి లభించిందన్నారు. డిప్లమో ఇన్ ఎంఎల్టీ, రేడియాలజీ, ఓటీ టెక్నీషియన్, అనస్తీషియా, కార్డియాక్, క్యాత్ ల్యాబ్, డయాలసిస్, ఫెర్ ఫ్యూజన్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. దీనికి ఇంటర్ ఏ గ్రూప్ విద్యార్థులైనా అర్హులన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ బోధన, ప్రాక్టికల్స్‌తో కూడిన శిక్షణ అందిస్తామన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 73373 62530 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దంత వైద్యశిబిరం

మధురపూడి: దంత సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని రాజమహేంద్రవరానికి చెందిన అయిత జయభారతి అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని అయిల వారి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆదివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వందమందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆర్యాపురం అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ అయిల గోపీ, వైఎస్సార్ సీపీ కోరుకొండ అధ్యక్షుడు అయిల రామకృష్ణ, అయిల శ్రీను, పాపారావు పాల్గొన్నారు.

చిన్నారికి తులాభారం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో సూర్యారావుపేటకు చెందిన ఏఎస్ఐ వీరబాబు మనుమరాలికి ఆదివారం తులాభారం వేసి, మొక్కును చెల్లించుకున్నారు. బాబా సన్నిధిలో పటిక బెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేశారు. అనంతరం ఆలయ పూజారి ఆధ్వర్యంలో నామకరణ మహోత్సవం జరిపారు.

హుండీలలో నగదు చోరీ

సీతానగరం: రఘుదేవపురం కోట దుర్గమ్మ ఆలయం, ఆ గ్రామంలోని రామాలయం వద్ద ఉన్న కనక మహాలక్ష్మి ఆలయంలోని హుండీల్లో నగదును దొంగలు చోరీ చేశారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటలకు మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు హుండీ తాళాలను పగలకొట్టి నగదును దొంగిలించినట్టు అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైంది. ఈ రెండు హుండీల్లో సుమారు రూ.20 వేలు ఉండవచ్చని భావిస్తున్నారు.


టెండర్ ప్రక్రియ పూర్తి

అనపర్తి: నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం పందలపాక, పెదపూడి మండలం సంపర గ్రామాల్లో రూ.6 కోట్లతో ఏర్పాటు చేసే విద్యుత్ సబ్‌స్టేషన్లకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయినట్టు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పందలపాక, సంపర గ్రామాల పరిధిలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య కారణంగా వివిధ పరిశ్రమలు, గృహ వినియోగదారులు, తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రెండు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన తెలిపారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తి కారవడంతో త్వరలో నిర్మాణాకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభానికి శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే తెలిపారు.

యువతి మృతి

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధి రాజంపేటకు చెందిన కవల సత్యనాగు (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనాగు తండ్రి రాజమహేంద్రవరం గణేష్ చౌక్ వద్దగల రైతు బజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అతడికి బీపీ, సుగర్ ఉన్నందున తరచుగా కళ్లుతిరిగి పడిపోతుంటాడు. తండ్రి ఆరోగ్య పరిస్థితిపై మనస్థాపంతో సత్యనాగు ఈనెల 7న ఇంటివద్ద గడ్డిమందు తాగింది. వెంటనే రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆసుపత్రి సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అత్యుత్సాహం.. ప్రమాదానికి ఆహ్వానం



హేవలాక్ బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకుతున్న యువకుడు

వేసవి నేపథ్యంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వేడి నుంచి ఉపశమనం కోసం కొందరు పుష్కరాలరేవు వద్ద గోదావరిలో సేదతీరుతున్నారు. అయితే మరికొందరు యువకులు హేవలాక్ బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకుతూ కేరింతలు కొడుతున్నారు. ఇది చాలా ప్రమాదమని, అప్రమత్తంగా ఉండాలని ఈతగాళ్లు సూచిస్తున్నారు.

– రాజమహేంద్రవరం సిటీ

ఫొటో: సాక్షి,రాజమహేంద్రవరం